క్లుప్తంగా

షెడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



ఉపాధి సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ

హనుమంతునిపాడు: ఉపాధి హామీ నిధులతో నిర్మించే పశువుల షెడ్లు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం రంగసుబ్బ రాయుడు, ఏపీడీ రాజారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఒక్కో షెడ్ నిర్మాణానికి రూ.2.30 లక్షల నిధులు ఇస్తార న్నారు. ఉపాధి నిధులతో జరిగే పనులు త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని ఏపీఓకు, సిబ్బందికి సూచించారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, ఈసీ గోపి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివి



అబుల్ కలాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పామూరు: విద్యారంగానికి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివని నర్రమారెళ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం మహబూబ్‌బాషా అన్నారు. మండలంలోని నర్రమారెళ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తోట రమేష్, బి.కోటేశ్వరరావు, సుజాత, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అనేక సేవలు అందించారని, గ్రామీణ పేదలకు, బాలికలకు విద్యను అందించడంలో ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తొలుత మౌలానా చిత్ర పటానికి నివాళులర్పించారు. కమిషనర్ డానియల్ జోసఫ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో పట్టణంలోని ఆవుల వలన కల్గుతున్న ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చైర్మన్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్‌లు మాట్లాడారు.



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్, కమిషనర్ జోసఫ్

ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

కనిగిరి రూరల్: ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీగా కనిగిరికి చెందిన జగన్నాథం నాగేశ్వరావు ఎన్నికయ్యారు. విజయవాడలో వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షునిగా కుంభ శ్రీనివాసరావును, జనరల్ సెక్రటరీగా నాగేశ్వరావులను ఎన్నుకున్నారు. ఈమేరకు నాగేశ్వరరావును సోమవారం పలువురు అభినందించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జడ్జీ భరత్‌చంద్ర

కనిగిరి రూరల్: డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జీ కె. భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి కె. భరత్‌చంద్ర మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గం అన్నారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేటట్లు చూడాలని తెలిపారు. వాది, ప్రతివాదులకు లోక్ అదాలత్ పై అవగాహన కల్పించాలన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు చిన కత్తుల వల్లూరయ్య

టంగుటూరు: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని కొణిజేడులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చిన కత్తుల వల్లూరయ్య(38) ఆదివారం అర్ధరాత్రి కుటుంబ కలహాలతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఇంటి పైకప్పుకు ఉన్న రాడ్డుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వల్లూరయ్యకు కొడుకు, కుమార్తె ఉన్నారు, మృతుడి భార్య అంకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లు వచ్చేశాయ్..!

కనిగిరి విద్యుత్ డివిజన్‌లోని విద్యుత్ సర్వీసుల సంఖ్య: 1,12,920	
గృహాల విద్యుత్ మీటర్లు	(కేటగిరి -1)- 85,000
కమర్షియల్ మీటర్లు	(కేటగిరి- 2) - 4,500
పారిశ్రామిక మీటర్లు	(కేటగిరి 3)- 220
ప్రభుత్వ సర్వీసులు	(కేటగిరి 4)- 1,200
అగ్రికల్చర్	(కేటగిరి 5)- 22,000



ప్రభుత్వ కళాశాలలో స్మార్ట్ మీటర్‌ను బిగిస్తున్న విద్యుత్ అధికారులు

- తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాల్లో బిగింపు
- త్వరలో త్రిఫేస్ కనెక్షన్‌లకు మీటర్లు బిగింపు
- అవగాహన లేక ఆందోళన చెందుతున్న వినియోగదారులు



విద్యుత్ స్మార్ట్ మీటర్



స్మార్ట్ మీటర్లను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కనిగిరి రూరల్:

విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లు వచ్చేశాయి. కనిగిరి విద్యుత్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఇప్పటికి ప్రస్తుతం వినియోగంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలోను విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించారు. ప్రస్తుతం వాణిజ్య విభాగంలోని సింగిల్ ఫేస్ కనెక్షన్‌ల మీటర్ల వైపు అడుగులు వేసి, పట్టణ ప్రాంతాల బిగించే కార్యక్రమం ప్రారంభించారు. నెలన్నర నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన వ్యవధిలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారు. అయితే ఈ విధానంలో వినియోగదారులు ముందస్తుగా స్మార్ట్ మీటర్లకు రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ అవసరాలకు ముందుగానే డబ్బులు చెల్లించేలా నూతన విధానం అమలు కానుంది. ప్రస్తుతం ఈ మీటర్లలో ఇప్పటికి ఎటువంటి సిమ్ కార్డులు అమర్చలేదు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదేశాలు ఇచ్చేంత వరకు పోస్టు పెయిడ్ అమలు జరుగుతుంది. ఆ తర్వాతనే ప్రీ పెయిడ్ విధానం అమల్లోకి వస్తోందని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రక్రియపై ప్రజల్లో భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ముందస్తు చెల్లింపులపై పేదల్లో ఆందోళనలు రేకెత్తుతున్నాయి.

పేద వర్గాలకు ఇబ్బందులే..!

కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు సంబంధించిన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం విద్యుత్ బిల్లు ఈనెల వినియోగించిన కరెంట్ చార్జీని మరుసటి నెలలో చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. అపరాధ రుసుంతో మరో 15 రోజుల్లో చెల్లించేందుకు అవకాశం, సమయం ఉంటుంది. కానీ ప్రీ పెయిడ్ విధానంతో విద్యుత్ మీటర్లు అమర్చితే ఈ పరిస్థితి ఉండదు. ముందుగానే నగదు చెల్లించి రీచార్జ్ చేసుకోవాలి. అంటే మనం సెల్ ఫోన్‌కు ప్రీపెయిడ్ పద్ధతిలో ఏ విధంగా రీచార్జ్ చేసుకుని వాడుతున్నామో.. అదే విధానం అమలు జరుగుతుంది. ఈ ప్రక్రియ వల్ల పేద వర్గాల ప్రజల్లో ఇబ్బందులు తప్పవు. దీన్ని వివిధ సంఘాల నాయకులు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు, వ్యతిరేకిస్తున్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి:



ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఆ దిశగా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా అడుగులు వేయాలి. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ఉపయోగాలను గూర్చి వినియోగదారులకు ముందస్తుగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తే మంచిది. స్మార్ట్ మీటర్ల గురించి తెలియని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఎస్‌కే ఖాశింపీరా, ఏఐటీయూసి పట్టణ కార్యదర్శి

ఈ ప్రక్రియతో పేదలకు ఇబ్బందే:



ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్ల వల్ల పేదలకు కొంత మేర ఇబ్బంది కల్గుతుంది. రాత్రివేళ రీచార్జ్ అయిపోతే వారి పరిస్థితి ఏంటి. రాత్రంతా చీకట్లో ఉండాల్సిందేనా. కొందరికి రీచార్జ్ చేయడం తెలియదు. అలాంటి వారి పరిస్థితి వర్ణణాతీతంగా ఉంటుంది. ప్రభుత్వం పేదలకు పోస్ట్‌పెయిడ్ మీటర్లనే ఉంచాలి. పాత విధానంలోనే బిల్లులు వసూలు చేయాలి.

పీసీ కేశవరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి

దశలవారీగా ఏర్పాటు చేస్తాం:



ప్రభుత్వ,ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశాం. వాణిజ్య విభాగంలో సింగిల్ ఫేస్ కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లను పట్టణ ప్రాంతాల్లో బిగిస్తున్నాం. దశలవారీగా, త్రిఫేస్, కనెక్షన్‌లకు, వాణిజ్య, గృహ, వ్యాపార, పారిశ్రామిక, అన్ని రకాల సర్వీసులకు అమలు చేస్తాం. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరాను వినియోగదారులు పొందవచ్చు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తి స్థాయిలో అయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు పెట్టే అవకాశం ఉండవచ్చు.

ఉమాకాంత్(విద్యుత్ డీఈఈ, కనిగిరి)

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం వేడుకలు



పామూరు భుజంగేశ్వర ఆలయంలో విశిష్ట అలంకరణలో వల్లీ అమ్మవారు



భైరవకోనలో భర్గులేశ్వరుడు, త్రిముఖ దుర్గాదేవి మూల విగ్రహమూర్తులు



పెదయిర్లపాడులో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

పామూరు: కార్తీకమాసం రెండో సోమవారం వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక వల్లీసమేత భుజంగేశ్వరస్వామి ఆలయంలో భుజంగేశ్వరస్వామికి అర్చకులు మహంకాళి శివప్రసాద్, అబ్బరాజు ఫణి, జొన్నాబొట్ల తేజలు ఏకాదశ రుద్రాభిషేకం, వల్లీ అమ్మవారికి కుంకుమపూజ చేయగా మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. స్థానిక మదన వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, రమాసమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయం, అయ్యప్ప ఆలయంతో పాటు సహస్రలింగేశ్వరస్వామి, అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశజ్యోతిర్లింగాల ఆలయం, బొట్లగూడూరులోని కామాక్షీసమేత రామలింగేశ్వర స్వామి, దాదిరెడ్డిపల్లెలోని పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి, పడమటి కట్టకిందపల్లెలోని శ్యామలా కామాక్షి సమేత మల్లేశ్వరస్వామి, మోపాడు పంచాయతీ పరిధిలోని గొందిమల్లేశ్వరస్వామి, అనుమనిగిరి శ్రీ శివరామ బ్రహ్మక్షేత్ర ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, గుర్రం వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: కార్తీక రెండో సోమవారం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శైవ క్షేత్రాలు శివ నామ స్మరణాలతో మార్మోగాయి. స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇసుకతో తయారు చేసిన సైకత లింగం ప్రత్యేక అలంకరణగా నిలిచింది. పట్టణంలోని దొరువు వద్ద ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయంలోని శివ లింగాలకు, బోడ్డు చావిడి వద్ద ఉన్న నాగశిలలకు, నందనమారెళ్ల గుడిలో, పునుగోడులోని సిద్దేశ్వర స్వామి ఆలయంలో భక్తులు విశిష్ట పూజలు చేసి, కార్తీక దీపాలను ఎంతో నియమ నిష్ఠలతో వెలిగించారు.

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో కార్తీకమాసం రెండో సోమవారం వేడుకలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జలపాతం వద్ద ఉత్సాహంగా గడిపారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలను దేవస్థాన ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తీర్చిదిద్ది వసతులు కల్పించారు. సీఎస్‌పురంలో పార్వతీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామిఅభిషేకం, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు.

పీసీపల్లి: మండల పరిధిలోనే పెద్ద యిర్లపాడులో వెలసిన మల్లేశ్వరస్వామి, వెంగళాపురం సమీపంలోని పంచలింగాల కొండలో కార్తీక సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి పంచామృత అభిషేకం, బిల్వార్చన, అన్న సంతర్పణ, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పామూరు భుజంగేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



వివిధ ఆలయాల్లో విశిష్ట పూజలు

టంగుటూరు: కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్ములపాలెం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం, పంచముఖేశ్వర స్వామి 1116 శివలింగాల ఆలయంలో భక్తులు పూజలు చేశారు. స్వామికి పంచామృత అభిషేకాలు, గోత్రనామార్చన మొదలగు విశేష పూజలు జరిగాయి. పసుకుదురు గ్రామంలో పురాతన శివాలయం, టంగుటూరు, పొందూరు శివాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మద్దిపూడి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మద్దిపూడి: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయాలు కిటకిటలాడాయి. మహిళలు వేకువజామునే తలంటు స్నానాలు చేసి చేసి ప్రమిదలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. మద్దిపూడిలోని శివాలయంలో ఆలయ అర్చకులు నుదురుపాటి అంబయ్య పంతులు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.



జమ్ములపాలెంలో శివలింగాలను పూజిస్తున్న మహిళలు



జమ్ములపాలెంలో 1116 శివలింగాలను మొక్కుతున్న భక్తులు

విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ రఘుపతి

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు విద్యతో పాటు సేవాదృక్పథం అలవరుచుకోవాలని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి.రఘుపతి అన్నారు. మండలంలోని శీలంవారిపల్లెలో కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు వారం రోజులుగా వ్యవసాయ కళాశాల 4వ సంవత్సర విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈసందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల సేవా కార్యక్రమంలో గ్రామంలో పారిశుధ్యం, బ్లీచింగ్, రైతులకు విత్తనాలు, పంటలసాగుపై అవగాహన, ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు వివరించారు. సీజనల్ వ్యాధులు, పంటల సాగులో రైతులు ఆధునిక పద్ధతులపై రైతులకు విద్యార్థులు వివరించారు. ఉద్యానవన కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్త మోటార్ బిగింపు



తాగునీటి బోరుకు కొత్త మోటారు బిగిస్తున్న పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

హనుమంతునిపాడు: మండల పరిధి హాజీపురం ఎస్సీకాలనీలో నెలరోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై 'హాజీపురం ఎస్సీ కాలనీలో తాగునీటి కష్టాలు'అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సోమవారం కొత్త మోటార్‌ను కొనుగోలు చేసి బోరుకు బిగించారు. దీంతో తాగునీటికి ఇబ్బందులు తప్పాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రతిభ పరీక్షలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి



టాలెంట్ టెస్ట్ పత్రాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ నారాయణరెడ్డి

కనిగిరి రూరల్: ప్రతిభ పరీక్షలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, ఏకాగ్రతను, పట్టుదలను పెంపొందిస్తాయని ఎంఈఓ యువీ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్న సువెన్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల వెంకటరెడ్డిని కొనియాడారు. పదో తరగతి స్థాయిలో 144 మంది, ఐదో తరగతి స్థాయిలో 44 మంది విద్యార్థులు పోటీ పరిక్షల్లో పాల్గొన్నారు. విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి, పీఈటీ బి.కాశీ విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



టంగుటూరులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ స్వర్ణలత

టంగుటూరు: రైతులు ప్రత్యామ్నాయ పంటలైన మినుము, శనగ మొదలగు పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి స్వర్ణలత అన్నారు. టంగుటూరు, వెలగపూడి గ్రామాలల్లో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పంటల సాగుపై సోమవారం రైతులకు శిక్షణ నిర్వహించారు. ఏఓ స్వర్ణలత మాట్లాడుతూ పొగాకుకు మంచి ధరలు వస్తున్నాయని రైతులు ఒకే పంట సాగు చేయడం వల్ల భూమి సారం తగ్గుతుందన్నారు. రైతులు మట్టి పరీక్షలు ఆధారంగా పంటలు, ఎరువులు వేసుకోవాలని తెలుపుతూ చౌడు భూములు ఉన్న రైతులకు రాయితీపై జిప్సం ఎరువు సరఫరా చేయాలని అధికారులను కోరారు. గ్రామ వ్యవసాయ సంచాలకులు శృతి, లింగారావు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని ఏడీఏ ఈ వెంకట రమణ అన్నారు. మండలంలోని భూతంవారిపల్లి, మాచవరం గ్రామాల్లో సోమవారం పొగాకు రైతులకు పత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. ఏఓ పీ జోత్స్నాదేవి, పొగాకు టుబాకో అక్షన్ సూపరిండెంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

కనిగిరి రూరల్: సచివాలయాల వద్ద వ్యక్తిగత అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు అన్నారు. స్థానిక కార్యాలయం వద్ద సోమవారం కరపత్రాలను ఆవిష్కరించి, అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 18న సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద వ్యక్తి గత అర్జీల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. జి.బాలిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే ఖాశింపీరా, జి.రమణయ్య, ఆర్‌రామయ్య పాల్గొన్నారు.

16న మండల సమావేశం

మద్దిపూడి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 16న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

13న మండల సమావేశం

హనుమంతునిపాడు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 13న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు సోమవారం ఒక ప్రకటల్లో తెలిపారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

క్యాన్సర్ బాధితులకు ధైర్యమే సగం చికిత్స



మాట్లాడుతున్న వైద్యురాలు డాక్టర్ అనూష

కొండపి: క్యాన్సర్ బాధితులకు ధైర్యమే సగం చికిత్స అని పెట్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పి.అనూష అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో క్యాన్సర్పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు ప్రపంచంలో క్యాన్సర్ కేసులో పెరుగుతున్నాయని, ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్నారు. క్యాన్సర్ పట్ల వైద్యులతో పాటు ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎంఈఓ సురేఖ, సూపర్‌వైజర్ విక్టోరియారాణి, హెల్త్ సూపర్‌వైజర్ నరసింహారావు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.59 లక్షలు



దాతలకు నగదు రసీదు అందజేస్తున్న ఈఓ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,59,598 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.87,710, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.37,890, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.11,882, మహాప్రాకార నిర్మాణానికి రూ.10,116 ఇతర విరాళాలుగా రూ.12 వేలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. మహాప్రాకార నిర్మాణానికి జిల్లాలోని కొమరోలు మండలం కిష్టంపల్లె గ్రామానికి చెందిన గుద్దేటి సుబ్బమ్మ రూ.10,116 విరాళంగా ఇచ్చారన్నారు.

పస లేని రాష్ట్ర బడ్జెట్

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పస లేదు.. బాబు మార్క్ మోసం కన్పించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బాబు సూపర్ సిక్స్ హామీలకు గ్యారంటీ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఇళ్లకు కేవలం నాల్గు వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఆశాఖ బకాయిలు, జీతాలు, నిర్వాహణ ఖర్చులకే అవి సరిపోవని విమర్శించారు. ఇళ్ల స్థలాలకు నిధుల కేటాయింపు జరగలేదని, నీటి వనరులకు ప్రాజెక్టులకు నిధులు లేవని, ప్రతి మహిళకు రూ.1500 నెలకు ఇచ్చే హామీపై ఊసే లేదని, తల్లికి వందనం ప్రశ్నార్థకంగా మారిందని, సామాజిక పింఛన్లకు ప్రత్యేక నిధుల కేటాయింపు లేదని, నిరుద్యోగ భృతి విస్మరించారన్నారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు లేవని, మత్స్య శాఖను పూర్తిగా మరిచారని, కొత్త జిల్లాలకు నిధుల కేటాయింపు చేయలేదని తీవ్రంగా మండిపడ్డారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా కేశవరావు



మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కనిగిరి రూరల్: సీపీఎం కనిగిరి పట్టణ కార్యదర్శిగా పీసీ కేశవరావు నియమితులయ్యారు. పట్టణ అరవ మహాసభల అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వై ఏడుకొండలరావు, ఎస్‌కే బషీరా, కె.శాంతకుమారి, ఆరు ఏడుకొండలు, యు పిచ్చయ్య, పి నరేంద్ర, జీ శ్రీనివాసులు, వెంకటమ్మ, ప్రసంగిలతో పాటు మరి కొందర్ని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.